ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శనివారం 27 జనవరి 2024 | 5



- సమష్టి భాగస్వామ్యంతో జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు నడిపిద్దాం
- కలెక్టర్ కృతికా శుక్లా
- కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు
- ఆకట్టుకున్న పోలీసు కవాతు, సాంస్కృతిక ప్రదర్శనలు

మిన్నంటిన గణతంత్ర సంబరాలు



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన పోలీస్ జాగిలాల ప్రదర్శన

కాకినాడ సిటీ, జనవరి 26: ప్రజలందరి సమష్టి భాగస్వామ్యంతో జిల్లాను అభివృద్ధి పథంలో మరింత ముందుకు నడిపిద్దామని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా పిలుపునిచ్చారు. 75వ గణతంత్ర దినోత్సవాన్ని కాకినాడలోని పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ కృతికా శుక్లా సంప్రదాయ పోలీస్ కవాతును తిలకించి జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు. కార్యక్రమానికి విశిష్టఅతిథులుగా కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీ కర్రిపద్మశ్రీ, జిల్లాపోలీస్ సూపరింటెండెంట్ ఎస్.సతీష్‌కుమార్, జేసీ ఎస్.ఇలాక్కియ హాజరయ్యారు. వేడుకల్లో కలెక్టర్ జిల్లా ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి వివిధ రంగాల్లో జిల్లా సాధించిన ఘనత, ప్రగతిని వివరించారు, ప్రసిద్ధ చేనేత కళా ఉత్పత్తి ఉప్పాడ జాందాని చీర 2023 సంవత్సరానికి ప్రతిష్టాత్మకమైన వన్‌డిస్ట్రిక్.. వన్ ప్రొడక్ట్ జాతీయ అవార్డును అందుకోవడం జిల్లా ప్రజలకు గర్వకారణమన్నారు. రెడ్‌క్రాస్ సహాయ నిధి సేకరణలో కాకినాడ జిల్లా రాష్ట్రంలో ప్రథమస్థానంలోను, సైనిక సంక్షేమ నిధి సేకరణలో రెండో స్థానంలో నిలిచి రాష్ట్ర గవర్నర్ అవార్డులను అందుకున్నామని తెలిపారు. ఘన వ్యర్థాల నిర్వహణ విభాగం కింద ఈ ఏడాది ఇండియా స్మార్ట్ సిటీస్ అవార్డుల్లో కాకినాడ నగరం దేశంలోనే రెండోస్థానంలో అవార్డు అందుకుందన్నారు. అనంతరం జిల్లాలో వివిధ రంగాల్లో సాధించిన ప్రగతిని వివరించారు. జిల్లాలో ఉత్తమ సేవలందించిన వివిధశాఖల అధికారులు 91మందికి కలెక్టర్, ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత సంకురాత్రి చంద్రశేఖర్, ఇన్‌చార్జి డీఆర్వో కె.శ్రీరమణి, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిషోర్, జె.సీతారామారావు, ఆర్జేడీ జి.నాగమణి, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ నాగనరసింహారావు, వివిధశాఖల జిల్లాస్థాయి అధికారులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



కాకినాడ పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థినుల విన్యాసాలు



పోలీసుల గౌరవ వందనం





గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్, ఎస్పీ.. కవాతు చేస్తున్న మహిళా పోలీసులు



గణతంత్ర వేడుకలకు హాజరైన జిల్లాస్థాయి అధికారులు

మీ కోసమే వచ్చా.. బాధలు తీరుస్తా..

అధైర్యపడకండి.. అండగా ఉంటాం

బిక్కవోలు/నిడదవోలు/సీతానగరం, జనవరి 26 : మనదంతా ఒకటే కుటుంబం.. మీకు ఎప్పుడు ఏ కష్ట మొచ్చినా చంద్రబాబు చలించిపోయేవారు.. తక్షణం ఆదుకునే వరకు ఆరాటపడేవారు.. అటువంటి చంద్రబాబునాయుడిని అక్రమంగా అరెస్టు చేసి జైలులో పెడితే మాతో సమంగా మీరంతా ఎంతో చలించిపోయారు.చంద్రబాబు పడే కష్టం, బాధలు చూసి ఆయన్ని అభిమానించి ఆరాధించే మన కుటుంబంలో ఎన్నో గుండెలు కొట్టుకోవడం ఆగిపోయాయి..అని ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్‌పర్సన్, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. ఆ గుండెల బాధను మీతో మాట్లాడి తీర్చాలని వచ్చా అన్నారు. బిక్కవోలు,సీతానగరం మండలం కాటవరం, నిడదవోలు మం డలం కలవచర్ల, పందలపర్రు, తిమ్మరాజుపాలెం గ్రామాల్లో శుక్రవారం నిజం గెలవాలి యాత్ర నిర్వహించారు.ఉదయం బిక్కవోలులో ఒక కుటుంబాన్ని పరామర్శించి అనంతరం నిడదవోలుకు వెళ్లారు.బాధిత కుటుంబీకులను పరామర్శించారు. . ధైర్యంగా ఉండండి అంటూ భరోసా ఇచ్చారు.ఒక్కో కుటుంబా నికి రూ. 3 లక్షల చొప్పున చెక్కు అందజేశారు. అనంతరం కాటవరం వెళ్లారు. అడుగడుగునా కార్యకర్తలు, నేతలు స్వాగతం పలికారు. పలు గ్రామాల్లో భారీ ఫ్లెక్స్ లు, టీడీపీ జెండాలతో పసుపుమయం చేశారు. పలువురు మహిళలు ఆమెను కలవగా వారిని ఆమె ఆప్యాయంగా పలుకరించారు.ఆమె వెంట టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మె ల్యే బూరుగుపల్లి శేషారావు తదితరులు ఉన్నారు.



తిమ్మరాజుపాలెంలో వెంకటలక్ష్మి కుటుంబీకులను ఓదార్చుతున్న భువనేశ్వరి

- 3 నియోజకవర్గాల్లో పర్యటన
- ఐదు కుటుంబాలకు పరామర్శ
- ధైర్యం చెప్పిన భువనమ్మ
- రూ.3 లక్షల చొప్పున చెక్‌లు
- వెంట నడిచిన నాయకులు
- ముగిసిన పర్యటన
- హైదరాబాద్‌కు పయనం



బిక్కవోలులో.. ఓదార్పు

బిక్కవోలు, జనవరి 26: టీడీపీ కార్యకర్తలకు ఎటువంటి ఆపద వచ్చినా పార్టీ అండగా ఉండి ఆదుకుంటుందని నారా భువనేశ్వరి తెలిపారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బిక్కవోలు గ్రామంలోని రొక్కల రాణి కుటుంబీకులను పరామర్శించారు.రాణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబీకులకు రూ.3 లక్షల చెక్కును అందజేశారు. చంద్రబాబు అక్రమ అరెస్టులకు నిరసనగా దళిత నేతలు చేపట్టిన రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న పెదపూడి మండలం రాజుపాలెంకు చెందిన కందుకూరి పెదసత్తియ్య అస్వస్థతకు గురవ్వడంతో అతనికి భువనేశ్వరి రూ.20 వేలు సాయం అందించారు.



మీకు నేనున్నా.. కంగారొద్దు

నిడదవోలు : టీడీపీ సీనియర్ నాయకుడిగా మాజీ సర్పంచ్‌గా ఏఎంసీ మాజీ వైస్ చైర్మెన్‌గా బోగిరెడ్డి సత్యనారాయణ(బూరయ్య) సేవలు చిరస్మరణీయమని నారా భువనేశ్వరి అన్నారు. నిడదవోలు మండలం పందలపర్రులో బూరయ్య కుటుంబీకులను ఆమె పరామర్శించి ఓదార్చారు. మీరంతా ధైర్యంగా ఉండి నిజం గెలిపించాలన్నారు. మనం అంతా కష్టసుఖాల్లో కలిసే ఉంటాం.. కలిసే ప్రయాణం చేస్తాం.. అంటూ బూరయ్య భార్యను ఓదార్చారు. ఆమె వెంట పందలపర్రు గ్రామ టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు ఉన్నారు.

తిమ్మరాజుపాలెంలో..

నిడదవోలు : చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన కుసుమే వెంకటలక్ష్మి గుండెపోటుతో మృతి చెందింది. ఈ మేరకు ఆమె కుటుంబీకులను భువనేశ్వరి పరామర్శించి కుసుమే వెంకటలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యురాలిని కోల్పోవడం బాధాకరమన్నారు.

నిడదవోలు : టీడీపీ అంటే నిడదవోలు మండలం కలవచర్ల గ్రామానికి చెందిన మన్నెం శ్రీనివాసరావుకు ప్రాణం.. ఎక్కడ టీడీపీ కార్యక్రమం జరిగినా...భుజాన టీడీపీ జెండా మోస్తూ అందరికంటే ముందు ఉండేవాడు..చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనోవేదనకు గురై అకస్మాత్తుగా గుండె ఆగి మరణించాడు. శుక్రవారం నారా భువనేశ్వరి, శ్రీను కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

అభయమిచ్చి..అండగా నిలిచి



సీతానగరం : చంద్రబాబు అరెస్టుతో మృతి చెందిన కాటవరం గ్రామానికి చెందిన దాసరి హరిప్రసాద్ కుటుంబీకులను శుక్రవారం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పరామర్శించారు. ముందుగా మృతుడి సోదరులు దాసరి అప్పారావు, దాసరి శ్రీనివాసరావులను ఓదార్చారు.అనంతరం రూ.3 లక్షల చెక్కు అందించారు. ఆమె వెంట ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి, మాజీ మంత్రి జవ హర్,రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బీవీఆర్‌చౌదరి ఉన్నారు.

కాటవరం వెళ్లి.. కన్నీళ్లు తుడిచి



భువనేశ్వరికి ఘన వీడ్కోలు



కోరుకొండ : జిల్లాలో "నిజం గెలవాలి" యాత్ర ముగించుకుని శుక్రవారం హైదరాబాద్ బయలుదేరిన నారా భువనేశ్వరికి మధురపూడి విమానాశ్రయం వద్ద పలువురు టీడీపీ నాయకులు వీడ్కోలు పలికారు.రాజానగరం టీడీపీ ఇన్‌చార్జ్ బీవీఆర్ చౌదరి, ఎమ్మెల్యేలు చినరాజప్ప, గోరంట్ల, మాజీ ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,బూరుగుపల్లి శేషారావు, మందలపు రవి, చిట్టూరి రంగారావు, పోలిన కృష్ణ, తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న కవాతు, శకటాల ప్రదర్శన

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 26: గణతంత్ర వేడుకల సందర్భంగా పోలీస్, ఎన్‌సీసీ, రెడ్‌క్రాస్ దళాలు నిర్వహించిన సంప్రదాయ కవాతు ఆహూతులను అలరించింది. ఈ ప్రదర్శనలో ఉత్తమ కవాతుగా ప్రథమ బహుమతిని హోంగార్డ్ కంటిన్జెంట్, ద్వితీయ బహుమతిని ఫ్రీ ఆంధ్రా ఎన్‌సీసీ బాలికల బెటాలియన్, రెడ్‌క్రాస్ సంస్థలకు కలెక్టర్, ఎస్పీ బహుమతులు అందించారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన 12శకటాలు అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతిని ప్రదర్శించాయి. తొలుత దేవదాయశాఖ ఆధ్వర్యంలో అన్నవరం సత్యనారాయణస్వామి అలయ అభివృద్ధిపై శకటం ప్రదర్శన చేయగా తదుపరి విద్య, జిల్లా నీటి యాజమాన్యం సంస్థ, పౌరసరఫరాలశాఖ, డీఆర్‌డీఏ, మహిళాశిశుసంక్షేమశాఖ, అటవీశాఖ, జిల్లా ఎన్నికల విభాగం, కాకినాడ నగరపాలకసంస్థ, వైద్యఆరోగ్యశాఖ, రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవలు శకటాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పోలీస్ జాగిలాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్తమ శకటాల ప్రదర్శనకుగాను జిల్లా గృహనిర్మాణ సంస్థకు ప్రధాన బహుమతి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మహిళా శిశుసంక్షేమశాఖలు సంయుక్తంగా ద్వితీయస్థానం, కాకినాడ స్మార్ట్‌సిటీ, కార్పొరేషన్‌లు సంయుక్తంగా తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నాయి.



ప్రదర్శనలో పాల్గొన్న అగ్నిమాపకశాఖ శకటం

కనువిందు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు

గణతంత్ర వేడుకల్లో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు జాతీయ స్ఫూర్తిని చాటిచెప్పాయి. కాకినాడ జగన్నాథపురం, చర్చ్‌స్క్వేర్ సెంటర్‌వద్దగల మున్సిపల్ బాలికల కళాశాల, కోటనందూరు కేజీబీవీ కాకినాడ మున్సిపల్ బాలికల పాఠశాల, రాయుడుపాలెంలో ఉమామనోవికాస కేంద్రం, గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థుల నృత్యప్రదర్శనలు అలరించాయి. సాంస్కృతిక ప్రదర్శనలో ప్రథమ బహుమతిని కోటనందూరు కేజీబీవీ, సాలిపేట మున్సిపల్ బాలికల పాఠశాల విద్యార్థులకు సంయుక్తంగా అందించారు. ద్వితీయ బహుమతిని జగన్నాథపురం మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయస్థానం, తృతీయ బహుమతి గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు అందించారు. రాయుడుపాలెం ఉమామనోవికాస కేంద్ర విద్యార్థులకు ప్రత్యేక బహుమతిని కలెక్టర్, ఎస్పీ అందించారు.

ప్రభుత్వ పథకాల సమాచారంతో స్టాల్స్ ఏర్పాటు

గణతంత్ర వేడుకల సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌వద్ద ఉద్యాన, మైక్రో ఇరిగేషన్, సెరీకల్చర్, వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా, పశుసంవర్ధక, మత్స్యశాఖల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటిలో ఉత్తమ స్టాల్స్‌గా మొదటి బహుమతి వ్యవసాయశాఖ, రెండో బహుమతి పశుసంవర్ధకశాఖ, మూడో బహుమతిని ఉద్యానశాఖ అందుకున్నాయి.



కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో జాతీయ పతాకంతో దేశభక్తిని చాటుతున్న విద్యార్థినులు



పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

రాజకీయ మార్పునకు ఉమ్మడి జిల్లా నుంచే శ్రీకారం చుట్టాలి

- కాకినాడ జిల్లా కాపు సామాజికవర్గ తటస్థులతో సమావేశంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు

సర్పవరం జంక్షన్, జనవరి 26: కాపు కార్పొరేషన్ ద్వారా రూ.10వేల కోట్లు, ఈబీసీ అమలు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ సిద్ధంగా ఉన్నారని, వైసీపీ రాక్షస పాలన నుంచి విముక్తి చేసి తటస్థులంతా సంఘటితంగా ముందుకు వచ్చి జనసేనకి చారిత్రక విజయం అందించే దిశగా రాజకీయ మార్పుకు ఉమ్మడి జిల్లానుంచే శ్రీకారం చుట్టాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు పిలుపునిచ్చారు. కాకినాడ విద్యుత్‌నగర్ చల్లా ఫంక్షన్ హాల్లో కాకినాడ జిల్లాకు చెందిన కాపు సామాజికవర్గంలోని ముఖ్యులు, తటస్థులతో శుక్రవారం అంతర్గత సమావేశం నిర్వహించారు. వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్‌కోసం టీడీపీతో పొత్తు జనసేన పొత్తు పెట్టుకుందన్నారు. అన్ని సామాజికవర్గాలకు లబ్ధిచేసే దిశగా పార్టీ మేనిఫెస్టోను తయారు చేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో కాపుల్లో ఓట్లు చీలకుండా జనసేనకు అండగా ఉంటూ ఇతర సామాజికవర్గాలతో కలిసి జనసేనకు అధికస్థానాల్లో ఎమ్మెల్యేలు విజయం సాధించేలా కృషిచేయాలని కోరారు. తటస్థులు, మేధావులు తమతో కలసి రావాలని కోరారు. అంతర్గత సమావేశానికి విచ్చేసిన నాగబాబుకు జనసేన కాకినాడ రూరల్ ఇన్‌చార్జి పంతం నానాజీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. సమావేశానికి ముందుగా జిల్లాకు చెందిన నాయకుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తటస్థులతో మాట్లాడి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించి మద్దతు కోరారు. కొత్తపేట ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాపు రిజర్వేషన్ ఉద్యమనేత దివంగత సలాది స్వామినాయుడు కుమారుడు సలాదిరామకృష్ణ తన అనుచరులతో పార్టీలో చేరారు. వీరికి నాగబాబు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సమావేశంలో జిల్లాకు చెందిన పార్టీ ఇన్‌చార్జులు, నాయకులు పాల్గొన్నారు.



సలాది రామకృష్ణకు కండువా పార్టీలోకి వేసి ఆహ్వానిస్తున్న నాగబాబు

జిల్లాలో పలువురు మున్సిపల్ కమిషనర్ల బదిలీలు

కాకినాడ సిటీ, జనవరి 26: సాధారణ ఎన్నికల నేపథ్యంలో పలువురు కమిషనర్ల బదిలీలు చేపట్టారు. ఇందుకు సంబంధించి ఏపీ మున్సిపల్ పరిపాలనశాఖ జీవో నెంబర్ 105 జారీ చేసింది. గ్రేటర్ విశాఖపట్నం కార్పొరేషన్ జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ ఏలేశ్వరం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీఅయ్యారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న థర్డ్ గ్రేడ్‌మున్సిపల్ కమిషనర్ ఎస్.కనకారావు పిఠాపురం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. పిఠాపురం మున్సిపల్ కమిషనర్ టీఎల్‌పీఎస్ఎస్ కృష్ణవేణి నిడదవోలుకు బదిలీకాగా నిడదవోలు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి పెద్దాపురం బదిలీ అయ్యారు. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎ.వెంకటరావు తుని మున్సిపల్ కమిషనర్‌గా రానున్నారు. నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యదర్శి టి.రవికుమార్ గొల్లప్రోలు కమిషనర్‌గా రానున్నారు. ఏపీమున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయ ఏడీ జి.శేఖర్ కాకినాడ డిప్యూటీ కమిషనర్‌గా రానున్నారు. కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎ.శ్రీవిద్య భీమవరం బదిలీఅయ్యారు. తుని కమిషనర్ బీజేఎస్‌పీ రాజు ఏలూరు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బదిలీపై వెళ్లనున్నారు.

రేపు హాకీ జిల్లా జట్ల ఎంపిక

కాకినాడ అర్బన్, జనవరి 26: సబ్ జూనియర్ బాలబాలికల హాకీ జిల్లా జట్ల ఎంపిక ఈనెల 28న కాకినాడలోని జిల్లా క్రీడామైదానంలో జరుగుతుందని హాకీ సంఘ జిల్లా కార్యదర్శి నంబు శ్రీనివాసరావు తెలిపారు. వచ్చే నెల 9నుంచి 11వరకు శ్రీకాకుళంలో జరిగే అంతర్ జిల్లాల బాలికల చాంపియన్‌షిప్‌లో ఎంపికైన బాలికలు పాల్గొంటారన్నారు. వచ్చేనెల 10నుంచి 12వరకు కర్నూలులో జరిగే బాలుర జూనియర్ హాకీ రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన బాలురు పాల్గొంటారని తెలిపారు. ఎంపికలో పాల్గొనే బాలికలు 2005, జనవరి1 తర్వాత పుట్టినవారై ఉండాలని, బాలురు 2008, జనవరి1 తర్వాత జన్మించినవారు అర్హులన్నారు.

జనసేనలో జోష్!

- రాజోలు, రాజానగరం నియోజకవర్గాలు జనసేనకే
- అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటనతో ఆ పార్టీలో సంబరాలు
- ఉమ్మడి అభ్యర్థుల ప్రకటనలో ఇప్పటికే మండపేట సీటు టీడీపీకి
- ఇటీవల మండపేట సభలో చంద్రబాబు నేరుగా ప్రకటన
- దీంతో జిల్లాలో మూడు సీట్ల ఒప్పందాలపై పూర్తి స్పష్టత
- వైసీపీలో అధికారిక ప్రకటనలేవీ లేకపోవడంతో అయోమయం

రానున్న సాధారణ ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడిగా పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో ఎవరికి ఎన్ని సీట్లు అనే ప్రకటన ఇప్పటివరకు రానప్పటికీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మాత్రం మూడు సీట్ల విషయంలో పూర్తి స్పష్టత వచ్చేసింది. ఇటీవల మండపేటలో జరిగిన రా.. కదలిరా.. సభలో చంద్రబాబు అక్కడి నుంచి పోటీ చేసే అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పేరును ప్రకటించారు. దీంతో ఇక్కడి నుంచి టీడీపీ తిరిగి పోటీ చేస్తుందనేది స్పష్టమైపోయింది. అదేవిధంగా శుక్రవారం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తాము వచ్చే ఎన్నికల్లో రాజోలు, రాజానగరం నియోజకవర్గాల నుంచి పోటీ చేయబోతున్నట్టు ప్రకటించారు. ఈవిధంగా ఆ రెండు చోట్ల జనసేన బరిలోకి దిగుతున్నట్టు తేలిపోయింది. ఆయా నియోజకవర్గాల్లో పూర్తి స్పష్టత రావడంతో మండపేటలో టీడీపీ, ఇటు రాజోలు, రాజానగరంలలో జనసేన శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.

రాజానగరం జనసేనకే..

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

రాజానగరం నుంచి జనసేన పోటీ చేస్తుందని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించడంతో ఆ నియోజకవర్గంలోని జనసేన సంబరాలు చేసుకుంటోంది. టీడీపీ, జనసేన ఉమ్మడిగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తుందని చెబుతూ టీడీపీ రెండు సీట్లు ఇప్పటికే ప్రకటించినందున తాము కూడా రెండు సీట్లను ప్రకటిస్తున్నట్టు జనసేన అధినేత స్పష్టం చేశారు. అయితే అభ్యర్థి ఎవరనేది ఇంకా స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అయితే ఇక్కడ ఇంతవరకూ జనసే పార్టీ కోసం పనిచేస్తున్న బత్తుల బలరామకృష్ణ వర్గం మాత్రం తమకే టిక్కెట్టు ఖరారైనట్టు చెబుతోంది. గతంలో ఇక్కడ టీడీపీ ఎమ్మెల్యేగా రాజానగరం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ పనిచేశారు. తర్వాత నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగానూ కొనసాగారు. అనంతరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బొడ్డు వెంకటరమణ చౌదరి (బీవీఆర్ చౌదరి)ని ప్రకటించింది. దాంతో ఆయన నియోజకవర్గ బాధ్యతలను తన భుజానకెత్తుకున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. పవన్ కల్యాణ్ రాజానగరం సీటును ప్రకటించిన సమయానికి నిజం గెలవాలి అనే కార్యక్రమంలో భాగంగా సీతానగరం మండలంలో కాటవరంలో పర్యటించిన నారా భువనేశ్వరి వెంట ఉన్నారు. పవన్‌కల్యాణ్ ప్రకటనపై ఆయన ఎలాంటి స్పందన వ్యక్తంచేయలేదు. అధిష్ఠానం సూచనల కోసం ఎదురుచూస్తున్నట్టు ఆయన వర్గీయులు చెబుతున్నారు.

వైసీపీలో అయోమయం

అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఇప్పటివరకు వైసీపీ తమ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించలేదు. అయితే కాకినాడ జిల్లాలో ముగ్గురు ఇన్‌చార్జులను మార్చి కొత్త వారిని నియమించింది. అలాగే కోనసీమ జిల్లాలో పి.గన్నవరం ఇన్‌చార్జిని నియమించింది. రామచంద్రపురం నుంచి గతంలో పోటీచేసిన మంత్రి వేణును రాజమహేంద్రవరం రూరల్‌కు మార్చింది. తూర్పుగోదావరి జిల్లాలో రాజమండ్రి సిటీ ఇన్‌చార్జిగా భరత్‌ను నియమించగా, కొవ్వూరు నుంచి గోపాలపురం నియోజకవర్గానికి వనితను వైసీపీ అధిష్ఠానం మార్చింది.

రాజోలు మళ్లీ జనసేనకే..

మండపేట మళ్లీ టీడీపీకే..

(అమలాపురం -ఆంధ్రజ్యోతి)

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కోనసీమ జిల్లాలోని రాజోలు నియోజకవర్గంలో జనసేన పోటీ చేస్తుందని గణతంత్ర దినోత్సవ వేడుకల్లో చేసిన ప్రకటన ఆ పార్టీలో జోష్ నింపింది. గతంలో జనసేన ఇక్కడి నుంచే గెలుపొందిన విషయం తెలిసిందే. టీడీపీ, జనసేన ఉమ్మడిగా పోటీచేయబోతున్న నేపథ్యంలో రాజోలు సీటు నుంచి తమ పార్టీ పోటీ చేస్తుందని పవన్ ఈ ప్రకటన చేశారు. ఇది ఆ పార్టీ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపింది. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఇక్కడ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తారని ఆ పార్టీ కేడర్ భావించింది. కొన్ని నెలల కిందట ఇరుపార్టీల మధ్య పొత్తుపొడవడంతో అప్పటి నుంచి రాజోలు సీటుపై సందిగ్ధం నెలకొంది. ఎందుకంటే గత ఎన్నికల్లో రాష్ట్రంలోనే జనసేన నుంచి రాపాక వరప్రసాదరావు ఏకైక ఎమ్మెల్యేగా గెలిచారు. తరువాత వైసీపీలో చేరారు. అయితే జనసేనకు సిట్టింగ్ స్థానమైన రాజోలు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం నుంచి తిరిగి జనసేన పోటీలో ఉంటుందని ఆ పార్టీ భావిస్తూ వస్తోంది. శుక్రవారం పవన్‌కల్యాణ్ చేసిన ప్రకటనతో ఆ నియోజకవర్గంలో పూర్తి స్పష్టత వచ్చేసింది. టీడీపీ సిట్టింగ్ స్థానమైన మండపేట నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తిరిగి పోటీ చేస్తారని చంద్రబాబు ప్రకటించగా, జనసేన సిటింగ్ స్థానాన్ని పవన్‌కల్యాణ్ ప్రకటించడంతో కోనసీమ జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో ఇక ఐదు నియోజకవర్గాల్లోనే పొత్తు ప్రకారం సీట్ల కేటాయింపు జరగాల్సి ఉంది. ఇప్పటివరకు రాష్ట్రంలో మరెక్కడా జరగని రీతిలో కోనసీమలో చెరో స్థానంలో టీడీపీ, జనసేనలు తమ అభ్యర్థులు పోటీ చేస్తారని ప్రకటించాయి. ఈ ప్రకటన వెలువడిన వెంటనే రాజోలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావుతో పార్టీలోకి కీలక నేతలు మాట్లాడినట్టు సమాచారం. సూర్యారావు కీలక నేతలతో సంభాషించిన తర్వాత మౌనంగానే ఉన్నారు. కాగా రాజోలు ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ జనసేన అభ్యర్థిత్వం కోసం పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నాయి. వారిలో ఒకరు సివిల్ సప్లయిస్ హోదాలో పనిచేసిన దిండి గ్రామానికి చెందిన దేవ వరప్రసాద్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. జనసేన పార్టీ ప్రణాళికల్లో వరప్రసాద్ కీలక పాత్ర వహించారనే ప్రచారం ఉంది. ఇప్పటికే వైసీపీ నుంచి జనసేనలో చేరిన విశ్రాంత చీఫ్ ఇంజనీర్ బొంతు రాజేశ్వరరావుతోపాటు డాక్టర్ రాపాక రమేష్ పేర్లు వినిపిస్తున్నాయి. జనసేన అభ్యర్థినీ ఖరారుచేస్తే ఇక ఎన్నికల జోష్ ఊపందుకుంటుంది.



కేంద్ర కారాగారంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న డీఐజీ రవికిరణ్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

ఘనంగా గణతంత్ర దినోత్సవం

రాజమహేంద్రవరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జాతికి స్వేచ్ఛావాయువులను.. దృఢమైన రాజ్యాంగం గొడుగు కింద గర్వంగా జీవించే అదృష్టాన్ని ప్రసాదించిన మహానుభావులను కీర్తిస్తూ మువ్వన్నెల పతాకం ఠీవిగా రెపరెపలాడింది. 75వ గణతంత్ర దినోత్సవ సంబరాలు శుక్రవారం అంబరాన్నంటాయి. జిల్లా కోర్టు ఆవరణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గణతంత్ర దినోత్సవ గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నాగేశ్వరరావు, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి పాల్గొన్నారు. కేంద్ర కారాగార ప్రాంగణంలో జైళ్లశాఖ కోస్తాంధ్ర ప్రాంత డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఎంఆర్ రవికిరణ్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్ రాజ్‌కుమార్, ఏఎస్ డి.రాఘవేంద్రరావు, డీఎస్ బి.రత్నరాజులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకలు



జాతీయ జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న బీఎం శ్రీనివాసరావు, ఉద్యోగులు

దివాన్‌చెరువు, జనవరి26: మన రాజ్యాంగం విశిష్టతను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన గురుతర బాధ్యత మనందరిపై ఉందని ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. దివాన్‌చెరువులోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో భారత గణతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం ప్రతి ఒక్కరికీ ఎంతో ముఖ్యమైన పండుగలని అన్నారు. ఈ స్ఫూర్తిని భావి తరాలకు తెలియజెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి బీహెచ్‌వీ మంగేష్, సర్క్యులేషన్ మేనేజర్ బి.గోపాలకృష్ణ, జిల్లా రిపోర్టర్స్ ఇన్‌చార్జి ఎస్ఎస్ఎన్ సత్యనారాయణ, ప్రొడక్షన్ ఇన్‌చార్జి ఎం.రాజేంద్ర, సిస్టమ్స్ ఇన్‌చార్జి ఎన్.శివకుమార్, సబ్‌ఎడిటర్ జి.శేషగిరిరావు, రిపోర్టర్లు పి.రమేష్‌నాగేంద్ర, వీర్రాజు, కాదంబరి శ్రీనివాస్, ఫొటోగ్రాఫర్ ఎస్.రాంబాబు, యాడ్స్ విభాగ సిబ్బంది బీవీ సుబ్రహ్మణ్యం, ఎం.రవీంద్రప్రసాద్, కె.కిరణ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది జి.వీరభద్రరాజు, జి.ఈశ్వరరావు, సెక్యూరిటీ సూపర్‌వైజర్ ఎ.చిన్నకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



దేశభక్తి స్ఫూర్తి నింపిన.. 150మీటర్ల జాతీయ పతాకం

రాజమహేంద్రవరం, జనవరి26(ఆంధ్రజ్యోతి): 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా 150 మీటర్ల భారీ జాతీయ పతాకంతో కేశవరెడ్డి స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు భరతమాత, గాంధీజీ, సుభాశ్ చంద్రబోస్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ, రుద్రమదేవి, కట్టబ్రహ్మన్న, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, తాంతియాతోపే వేషధారణలతో అలరించారు. పిరమిడ్ విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కేశవరెడ్డి విద్యా సంస్థల ఛైర్మన్ ఎస్.కేశవరెడ్డి తన సందేశాన్ని విద్యార్థులకు పంపించారు.

మునికోటేశ్వరరావుకు భువనేశ్వరి కృతజ్ఞతలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 26 : చంద్రబాబు జైలులో ఉన్న సమయంలో 52 రోజులపాటు ఆయన కుటుంబం ఇక్కడే ఉన్న విషయం తెలిసిందే. ఆ సమయంలో షెల్టర్ ఇచ్చిన అక్కిన మునికోటేశ్వరరావును టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గత మూడురోజులుగా ఉమ్మడి జిల్లాలో నిజంగెలవాలి కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం చేరుకుని మునికోటేశ్వరరావు కుటుంబీకులను కలుసుకుని కాసేపు మాట్లాడారు. భువనేశ్వరికి సాదర స్వాగతం పలికారు. ఆమె అక్కడి నుంచి బయలుదేరి హైదరాబాద్ వెళ్లిపోయారు.



భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న మునికోటేశ్వరరావు కుటుంబ సభ్యులు





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐడియల్ కళాశాల అకడమిక్ డైరెక్టర్ రంజిత్... 'స్వప్నం రాల్చిన అమృతం' నాటికలో ఓసన్నివేశం

చంద్రమాంపల్లిలో ముగిసిన రాష్ట్రస్థాయి నాటిక పోటీలు

పెద్దాపురం, జనవరి 26: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని చంద్రమాంపల్లి (దివిలి) గ్రామంలో స్నేహ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గత మూడ్రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి నాటికల పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల రాష్ట్రస్థాయి నాటిక పోటీల్లో చివరిరోజు ముఖ్య అతిథిగా ఐడియల్ కళాశాల అకడమిక్ డైరెక్టర్ ఎం.రంజిత్ హాజరై ప్రసంగించారు. నాటక రంగాన్ని బతికించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేసి రాజా, ఇంధన బ్రహ్మానందం, దేవాడ పాపేశ్వరరావు, మంతెన సత్తిబాబు, మానేపల్లి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. కాగా చైతన్య కళాభారతీ (కరీంనగర్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వప్నం రాల్చిన అమృతం' నాటిక ఎంతగానో ఆకట్టుకుంది. ఈ నాటికను పరమాత్ముని శివరామ్ రచన, మంచాల రమేష్ దర్శకత్వం వహించారు. అలాగే మిత్రా క్రియేషన్స్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'లక్ష్మణరేఖ దాటితే' నాటిక ఎంతగానో ఆకట్టుకుంది. దీనికి రచన కోన గోవిందరావు, ఎంఎమ్ బాషా దర్శకత్వం వహించారు. అలాగే సహృదయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'నేరస్థులు' నాటిక కూడా ఎంతగానో ఆకట్టుకుంది. ఈ నాటికకు రచన, నాగాభట్ల బాపన్నశాస్త్రి దర్శకత్వం వహించారు.



ప్రియాంక గార్డెన్స్‌లో టీడీపీ, జనసేన సమావేశంలో ఏర్పాట్లపై సమీక్షిస్తున్న నేతలు

రా కదలిరా.. బహిరంగ సభను విజయవంతం చేద్దాం!

జిల్లా టీడీపీ- జనసేన నేతల నిర్ణయం.. నియోజకవర్గాల నుంచి కలిసి ర్యాలీతో రావాలని గోరంట్ల, దుర్గేష్ సూచన

రాజమహేంద్రవరం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఈనెల 29న కాతేరులో జరిగే తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని జిల్లా టీడీపీ-జనసేన నేతలు నిర్ణయించారు. స్థానిక ప్రియాంక గార్డెన్స్‌లో శుక్రవారం రాత్రి జిల్లాలో టీడీపీ- జనసేన నేతలు సమావేశమై పలు నిర్ణయాలు తీసుకున్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జనసేన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్, సిటీజనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గోపాలపురం టీడీపీ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు, నిడదవోలు ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, రాజానగరం జనసేన ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ, కొవ్వూరు జనసేన ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, అనపర్తి జనసేన ఇన్‌చార్జి తదితరులు పాల్గొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు పాల్గొనే సభను విజయవంతం చేయడానికి రెండు పార్టీలు సమన్వయంతో పనిచేయాలని, ఆయా నియోజకవర్గాల్లోని గ్రామాల నుంచి రెండు పార్టీల నేతలు కలసి ర్యాలీతో రావాలని నిర్ణయించారు. జోన్- 2 కోఆర్డినేటర్ మండలపు రవికుమార్ పలు సూచనలు చేశారు. టీడీపీ నేత గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జనసేన నేత కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఈ బహిరంగ సభను విజయవంతం చేయడం ద్వారా జిల్లాలో ఎన్నికల శంఖారావం పూరించడంతోపాటు మన బలం కూడా నిరూపించుకోవచ్చని ఆయన పిలుపునిచ్చారు.

పూర్తిగా కాలిపోయిన గుర్తుతెలియని మృతదేహం



రంగంపేట, జనవరి, 26 : రంగంపేట మండలం పాతవీరంపాలెం గ్రామశివారులోని జీడిమామిడి తోటలో అనుమానాస్పద స్థితిలో పూర్తిగా కాలిపోయిన గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించారు. పాతవీరంపాలెం వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. వివరాలు ఎవరికైనా తెలిస్తే ఎస్ఐ రంగంపేట 9440904854, సీఐ అనపర్తి 9440796538 నెంబర్లకు తెలియజేయాలని ఎస్ఐ పి.విజయ్‌కుమార్ కోరారు.

ఆ రైతు చనిపోయాడనుకొని..



రైతు పూసయ్య

రంగంపేట మండలం పాత వీరంపాలెం గ్రామానికి చెందిన రైతు శుక్రవారం గ్రామశివారు గల తన జీడిమామిడితోటలో పూర్తిగా కాలిపోయిన మృతదేహాన్ని చూసి ఓ రైతు తన బంధువులకు సమాచారం తెలపగా వారువచ్చి సెల్‌ఫోన్, మోటార్‌సైకిల్‌ను చూసి అవి కేతమళ్ళ పూసయ్యకు సంబంధించినవే అని నిర్ధారించుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొంత సమయానికి పూసయ్య వదలివెళ్లిన అతని సెల్‌ఫోన్‌కే ఫోన్‌చేసి తనకు గాయాలయ్యాయని, బతికే ఉన్నానని చెప్పగా బంధువులంతా తిరిగి అతను దగ్గరకు వెళ్లి రాజమహేంద్రవరం ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి వైద్యం చేయించారు. శుక్రవారం తాను పొలంలోకి వెళ్లగా అప్పటికే అక్కడికి చంపేసి తీసుకొచ్చిన శవాన్ని గుర్తుతెలియని తీసుకురాగా, వారంతా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దొంగిలించే దొంగల్లా ఉన్నారని.. వారిని ప్రశ్నించగా తనపై దాడి చేసి కొంతదూరం ఆటోలో తీసుకెళ్లి వదిలివేశారని ఆ రైతు తెలిపాడు. తను నెమ్మదిగా మెయిన్‌మీదకు వచ్చి వేరే ఫోన్‌తో తన ఫోన్‌కు ఫోన్ చేశానని తెలిపాడు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్



పోగొట్టుకున్న వస్తువులను అందజేస్తున్న డిపో మేనేజర్ రామన్నదొర

గోకవరం, జనవరి 26: ప్రయాణికురాలు బస్సులో మర్చిపోయిన విలువైన వస్తువులను తిరిగి జాగ్రత్తగా ఆమెకు అందజేసిన ఆర్టీసీ కండక్టర్‌ను పలువురు అభినందించారు. గోకవరం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు గురువారం మండపేట సర్వీస్‌కు బయలుదేరి వెళ్లింది. కొత్తతుంగపాడుకు చెందిన ముచ్చిక గన్నెమ్మ ఆ బస్సులో బంగారు వస్తువులు, పట్టీలు మర్చిపోయి బస్సు దిగి వెళ్లిపోయింది. ఇది గమనించిన ఆ బస్సు కండక్టర్ శేఖర్ ఆ వస్తువులను డిపోకు తెచ్చి మేనేజర్ రామన్నదొరకు అప్పగించారు. చివరకు గన్నెమ్మకు విషయాన్ని చేరవేసి బస్సులో ఆమె మర్చిపోయిన వస్తువులను శుక్రవారం అందజేశారు. వస్తువుల విలువ రూ.60,000 ఉంటుంది.

టీడీపీ, జనసేన వైపు చూస్తున్న 70 మంది వైసీపీ ఎమ్మెల్యేలు

ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, జనవరి26: టీడీపీ, జనసేన పొత్తుతో 70 మంది వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలు, నేతలు టీడీపీ, జనసేన వైపు చూస్తున్నారని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలు వారు ఏ నిముషంలోనైనా పార్టీలోకి చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పవన్‌కల్యాణ్ రాజోలు, రాజానగరం అసెంబ్లీ సీట్లను ప్రకటించగానే వైసీపీ కాపు నేతలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో కాపుల అభ్యున్నతికి వేలాది కోట్ల రూపాయలు కేటాయించామని, విదేశీ విద్యతోపాటు అనేక కార్యక్రమాలు చంద్రబాబు చేపట్టారని గుర్తుచేశారు. కాపులకు వైసీపీ చేసింది ఏమీ లేదని విమర్శించారు. టీడీపీ, జనసేన పొత్తుతో వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తాయని చినరాజప్ప పేర్కొన్నారు.

ఏకే మల్లవరంలో బెల్ట్‌షాపుపై దాడి

100 మద్యం బాటిళ్లు స్వాధీనం

గొల్లప్రోలు రూరల్, జనవరి 26: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో నిర్వహిస్తున్న మద్యం బెల్ట్‌షాపుపై ఎస్ఐ బాలాజీ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతాల్లోని షాపులు నుంచి కొనుగోలు చేసి అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్టు గుర్తించారు. 100 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని గొల్లప్రోలు పట్టణానికి చెందిన పాలిశెట్టి నాగచక్ర, ఏకే మల్లవరం గ్రామానికి చెందిన మడికి సురేంద్రలను అరెస్టు చేశారు.

గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్ఐ బాలాజీ →



పెద్ద పులి ఆచూకీ కోసం అధికారుల అన్వేషణ





నల్లజర్ల ఫారెస్ట్‌లో పులి అడుగు జాడలను పరిశీలిస్తున్న డీఆర్‌వో వేణుగోపాల్, సిబ్బంది

నల్లజర్ల, జనవరి 26 : తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తోంది... దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారని శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంతో అటవీశాఖ అధికారులు స్పందించారు. డీఆర్‌వో వేణుగోపాల్ తన సిబ్బందితో ఉదయం 9 గంటల నుంచే పెద్ద పులి ఆచూకీ కోసం అన్వేషణ ప్రారంభించారు. పులి పాదముద్రలు సేకరించారు. పులివెళ్లిన ప్రదేశాలను పరిశీలించారు. సుమారు 5 కిలోమీటర్ల దూరం వరకు పులి పాదముద్రలు ఉన్నాయి. నేల తేమశాతం లేకపోవడం వల్ల ఇసుకపైనే పులి పాదముద్రలు ఎక్కువగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. సేకరించిన ప్లగ్ మార్క్స్‌ను ఉన్నతాధికారులకు పంపించామని, త్వరలో సీసీ కెమెరా ఏర్పాటుచేసి పులిని పట్టుకుంటామని డీఆర్‌వో పేర్కొన్నారు.

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో అర్చన

పెద్దాపురం, జనవరి 26: పెద్దాపురం పట్టణంలోని మరిడమ్మ దేవస్థానంలో అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో అర్చన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. దేవస్థానం వేదపండితుల ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఓట్లు ఎలా అడుగుతాడు : జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, జనవరి 26: ప్రతిపక్షంలో ఉండగా తమకు అధికారం వస్తే మద్యపాన నిషేధం చేస్తానని, 2024 ఎన్నికల్లో మద్య నిషేధం చేసే ఓట్లు అడుగుతానన్న సీఎం జగన్ ఇప్పుడు ఓట్లు ఎలా అడుగుతాడని రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ ప్రశ్నించారు. మండలంలోని ఇర్రిపాక శివాలయం వద్ద శుక్రవారం విలేకర్ల సమావేశంలో నెహ్రూ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు రుణాలు మాఫీ చేస్తానన్న జగన్‌కు అధికారం ఇచ్చిన మహిళలకు మొండిచెయ్యి చూపడమే కాకుండా రాబోయే 26ఏళ్లకు కూడా అప్పులు తెచ్చి రాష్ట్రంలో తాగుబోతుల సంఖ్య రోజురోజుకు పెంచి నాణ్యత లేని మద్యాన్ని అమాయకులతో తాగించి మహిళల మాంగళ్యాలు తెంచి తన సొంత గళ్ళా నింపుకుంటున్నాడని ఆరోపించారు. మహిళలకు దీపం పథకం కింద 65లక్షల ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇచ్చిన ఘనత టీడీపీదేనన్నారు. బాలింతలు, అమృత ఆహారం, తల్లి బిడ్డా ఎక్స్‌ప్రెస్, బాలికలకు ఉచిత సైకిళ్లు, ఉచిత వైద్య పరీక్షలు ఇలా మహిళల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టగా వాటన్నింటిని నిర్వీర్యం చేసి ఆసరా పేరుతో జగన్ మహిళలకు టోకరా వేశాడని నెహ్రూ విమర్శించారు. కార్యక్రమంలో కొత్త కొండబాబు, అడపా భరత్‌బాబు, చదరం చంటిబాబు, తోట సర్వారాయుడు, మండపాక అప్పన్న దొర, ఆళ్ళ శ్రీమన్నారాయణ, కోనేటి వెంకటేశ్వరరావు, జ్యోతుల సత్తిరాజు, ఆళ్ళ దుర్గ బాబు, పెంటకోట శివ, మళ్ళ సుబ్బారావు, దాడి భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : వర్మ

గొల్లప్రోలు, జనవరి 26: మూడు దశాబ్దాలుగా పిఠాపురం నియోజకవర్గ ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ అహర్నిశలు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నానని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదేపల్లి రంగబాబు జయంతి సందర్భంగా మెయిన్‌రోడ్డులో గల రంగబాబు విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. వర్మ మాట్లాడుతూ 2పర్యాయాలు గొల్లప్రోలు సర్పంచ్‌గా, రెండు సార్లు ఏఎంసీ చైర్మన్‌గా పనిచేసిన రంగబాబు నిరంతరం ప్రజల కోసమే పనిచేశారన్నారు. తాను స్థానికుడినని, తన కష్టం, ఐదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి గుర్తించి తనకు అండగా నిలవాలని కోరారు కార్యక్రమంలో మాజీ ఎఎంసీ చైర్మన్ మాదేపల్లి వినీల్‌వర్మ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి'

ప్రత్తిపాడు, జనవరి 26: జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సీమాంధ్ర సంక్షేమ సంఘ కార్యాలయంలో శుక్రవారం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యల్లపు బులిరాజు, జిల్లా నాయకులు కొయ్యా శ్రీనుబాబు, కుండ సాయికుమార్‌యాదవ్, ముచ్చు అప్పలరాజు, దేవర అనూషయాదవ్, ధర్నాల కోట తాతబ్బాయి, కట్టమూరి కొండబాబు, మదినే నూకరాజు, వీరాస్వామి సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలను గుర్తించకపోవడం శోచనీయమన్నారు. ఈనెల 31లోగా బీసీలంతా ఐక్యమత్యంగా రాబోయే ఎన్నికల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై అవగాహనకు రానున్నట్టు తెలిపారు. సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు ధర్నాల కోట తాతబ్బాయి, యడ్ల వీరాస్వామి, ఒమ్మి గంగరాజు, చిలపర్తి శ్రీనివాస్, ఎం.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ, జనసేన కూటమితో మేలు'

తుని రూరల్, జనవరి 26: టీడీపీ, జనసేన కూటమితో ఏర్పడే ప్రభుత్వంతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య స్పష్టం చేశారు. తునిలో 26వ వార్డులో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఇరుపార్టీల ఉమ్మడి మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోల్నాటి శేషగిరిరావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, జిల్లా టీడీపీ యువత అధ్యక్షుడు యనమల శివ రామకృష్ణన్, మోతుకూరి వెంకటేష్, తుని పట్టణాధ్యక్షుడు ఇనుగంటి సత్యనారాయణ, మళ్ళ గణేష్‌కుమార్, చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి) తదితరులు ఉన్నారు.

ఠాకూర్‌కు భారతరత్న అవార్డుపై హర్షం

సర్పవరం జంక్షన్, జనవరి 26: బీహార్ మాజీ సీఎం కర్పూరి ఠాకూర్ శత జయంతి పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఠాకూర్‌కు భారతరత్న అవార్డు ప్రకటించడం పట్ల ధన్వంతరి నాయీ బ్రాహ్మణ సమాఖ్య, నమసమాజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం గైగోలుపాడు కార్యాలయంలో ధన్వంతరి నాయీ బ్రాహ్మణ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పొన్నాడ సత్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఠాకూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఠాకూర్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఆర్‌పీఐ రాష్ట్ర కార్యదర్శి పిట్ట వరప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం ఏపీ కన్వీనర్ చొల్లంగి వేణుగోపాల్, బీఎస్పీ నాయకులు నారాయణ గౌడ్, వాడపల్లి ముసలయ్య, దంగేటి పాపారావు పాల్గొన్నారు.

'భారతరత్న ప్రకటించడం ఆనందదాయకం'

కాకినాడ సిటీ, జనవరి 26: బీసీల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడిన బీహార్ మాజీ సీఎం దివంగత కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న అవార్డు ప్రకటించడం ఆనందదాయకమని కాకినాడ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం పేర్కొంది. సూర్యనారాయణపురంలోని నగర నాయీ బ్రాహ్మణ సంఘ కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు భీమనపల్లి వీరబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కింతాడ సత్యనారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ స్వయంవరపు శ్రీనివాసరావు,కోశాధికారి వీరబాబు ఉన్నారు.

విభిన్న ప్రతిభావంతుల ఆశ్రమం ప్రారంభం

తాళ్లరేవు, జనవరి 26: విభిన్న ప్రతిభావంతుల నిరీక్షణ ఆశ్రమాన్ని లవింగ్ హెండ్స్ డిజబుల్ సొసైటీ ఫౌండర్ బొడ్డు సత్యానందం ప్రారంభించారు. అంధులకు బ్రెయిలీ లిపి, వృత్తి విద్య, చేతివృత్తులు వంటి శిక్షణతో పాటుగా భోజనం, నివాసం సదుపాయాలను కల్పించనున్నామని తెలిపారు. దివ్యాంగులకు రగ్గులు, ప్లేట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు బొడ్డు ఆశాజ్యోతి, సరస్వతి, ఆర్ఎంపీ వైద్యులు సుజల్‌రాజ్, మిరయాల పెదబాబు, దైవకుమారి, ఆర్‌కె.రెడ్డి పాల్గొన్నారు.

కంప్యూటర్ బహూకరణ

తుని రూరల్, జనవరి 26: అన్నవరం వీరవెంకట సత్యనారాయణ దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న సాంస్కృతిక ఉన్నత పాఠశాల 2001-2002 విద్యార్థులు పాఠశాలకు కంప్యూటర్‌ను బహూకరించారు. శుక్రవారం అన్నవరం దేవస్థానం ఈవో రామచంద్రమోహన్‌కి ఉపాధ్యాయులు అల్లాడ వెంకటేశ్వరరావు సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డి.కుమార్, టి.వరప్రసాద్, కె.శ్రీకాంత్, టి.గంగా రమణ, ఎ.భగవాన్, ఆర్.వినోద్‌కుమార్, జి.శర్మ, వై.ఆదిత్య, దేవీ అపర్ణ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

జగ్గంపేట, జనవరి 26: జగ్గంపేట మండల రంగవల్లినగర్‌లోని ఇటీవల సంబంధించిన అగ్నిప్రమాదంలో పూరిపాకల దగ్ధమై నిరాశ్రయులుగా మిగిలిన బాధితులను అఖిలగాండ్ల తెలికులు సంఘం ఆదుకునేందుకు ముందుకువచ్చారు. గాండ్ల తెలికులు కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యూరు నాని, నరవ, అడ్డా వెంకటరాజు, గొట్టిపల్లి శ్రీనివాస్, కెల్లా ఉమామహేష్, వెన్నేటి వెంకటసుబ్బారావు, గండేపల్లి వీరబాబు, గుడివాడ శ్రీనివాస్ సంఘం తరుపున 2 బీరువాలు, 2 మంచాలు, నిత్యావసర సరుకులు, రూ.28 వేలు నగదు అందజేశారు. బాధితులను పూర్తిస్థాయిలో ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

సారా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

గొల్లప్రోలు రూరల్, జనవరి 26: సారా విక్రయిస్తున్న వ్యక్తులపై ఎస్ఐ బాలాజీ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. చేబ్రోలు శివారులో ఖండిపిల్లి సత్యనారాయణను అరెస్టు చేసి 15లీటర్లు, చెందుర్తి శివారులో డి.చంద్రరావును అరెస్టు చేసి 12లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టుకు హాజరుపరిచినట్టు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

జగ్గంపేట రూరల్, జనవరి 26: మండలంలోని జి.కొత్తూరు గ్రామానికి చెందిన రాయుడు శ్రీనుకు ఇద్దరు సంతానం. మొదటి కుమారుడు విష్ణు. బుధవారం ఇంటి నుంచి జగ్గంపేట పరీక్ష రాసేందుకు వెళ్తున్నానని చెప్పి తిరిగిరాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద గాలించినా ఏ సమాచారం లేకపోవడంతో జగ్గంపేట పోలీస్‌స్టేషన్లో శుక్రవారం విష్ణు తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు.

ఘనంగా 'గణతంత్ర' వేడుకలు

» జాతీయ పతాకాలకు గౌరవ వందనం
» మహనీయుల చిత్రపటాలకు నివాళి
» ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు


పిఠాపురంలో పతాకావిష్కరణ


ప్రత్తిపాడులో జెండా ఆవిష్కరణ


కాకినాడలో టీడీపీ నేతల నివాళి


కొత్తపల్లి: జాతీయ జెండాతో విద్యార్థుల ప్రదర్శన

కాకినాడ సిటీ, జనవరి 26: కాకినాడలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాకినాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల గాంధీరాజు పతాకావిష్కరణ చేశారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకటరమణ, సిటీ అధ్యక్షుడు దాట్ల గాంధీరాజు, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోలా ప్రసాదవర్మ, జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు తాళ్లూరి రాజు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు గదుల సాయిబాబు, దండుప్రోలు నాగబాబు ఉన్నారు.

కాకినాడ కలెక్టరేట్ ఆవరణలోని వంద అడుగుల జాతీయ జెండాను జేసీ ఇలాక్కియ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో కె.శ్రీరమణి, సీపీవో పి.త్రినాథ్, సివిల్ సప్లయిస్ డీఎం డి.పుష్పమణి, కలెక్టరేట్ ఏవో జీఎస్ఎస్ శ్రీనివాస్, డీఎస్‌వో బీవీ రాజు, వికాస పీడీ కె.లచ్చారావు పాల్గొన్నారు. కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఇట్ల కిషోర్ జాతీయ పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి వరహాలయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జేఎన్టీయూకే: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జేఎన్టీయూకే ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందన సమర్పణ చేసి ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ఆర్మీలో అమరులైన జవానుల కుటుంబసభ్యులను సత్కరించి మెమెంటోలను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమానికి వర్సిటీ స్పోర్ట్స్‌కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించగా రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, డైరెక్టర్లు సాయిబాబు, రవీంద్ర, గోపాలకృష్ణ, బాలకృష్ణ, బాలాజీ, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, పీడీలు వెంకటేశ్వరరావు, మహిదుర్గ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు,ఎన్‌సీసీ క్యాడెట్లు ఉన్నారు.

కాకినాడ రూరల్: కాకినాడ డీసీసీబీలో సీఈవో ఆర్వీ నరసింహారావు జెండాను ఆవిష్కరించగా ముఖ్య అతిథిగా చైర్మన్ ఆకులవీర్రాజు హాజరయ్యారు. కార్యక్రమంలో జీఎం ప్రవీణ్‌కుమార్, డీజీఎం శ్రీధర్ చౌదరి,ఆప్కాబ్ ఓఎస్‌డీ రాజీవ్‌బాబు, డీపీడీఎం బాపూజీ, డైరెక్టర్లు గంగాభవానీరామ్, సయ్యద్‌మొహిద్దీన్,శ్రీప్రకాష్ పాల్గొన్నారు. కాకినాడ డీఈవో కార్యాలయంలో వేడుకల్లో ఆర్జేడీ, ఇన్‌చార్జి డీఈవో జి.నాగమణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏసీఈ రాజశేఖర్, సీఎంవో నాగేశ్వరరావు, ఏఎస్‌వో దయానంద్ పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: కాకినాడ దుర్గాప్రసాద్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో వేడుకలు నిర్వహించారు. దేశ ప్రజల విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు అద్దంపట్టేలా భిన్నత్వంలో ఏకత్వం, దేశభక్తిని పెంపొందించేలా విద్యార్థుల జాతీయ పతాకం ప్రదర్శన, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలు తిలకించేందుకు పెద్ద ఎత్తున సందర్శకులు, స్థానికులు తరలివచ్చారు. స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్లు ప్రశాంత్, ప్రియాంకభాను ఉన్నారు.

పిఠాపురం: పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి కమిషనర్ కృష్ణవేణి, ప్రజా ప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పిఠాపురం సర్కిల్ కార్యాలయంలో సీఐ శ్రీనివాస్, ప్రభుత్వాసుపత్రిలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ విజయ, వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏడీ స్వాతి, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పితాని త్రినాథరావు, పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ మురళీమోహన్ జాతీయపతాకాలను ఎగురవేశారు. కోర్టుల ప్రాంగణంలో 12వ అదనపు జిల్లా జడ్జి ఏ.వాసంతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.సుధారాణి, అదనపు సివిల్ జడ్జి ఎంఎల్ సాయిసుభాష్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రాజారావు, కేఎస్ఆర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని భాష్యం స్కూలులో భారతమాత, స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో విద్యార్థులు అలరించారు. విద్యార్థులు జాతీయ పతాకాన్ని చేతబూని పిరమిడ్ ఆకారంలో నిలబడ్డారు.

సామర్లకోట: తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎస్.కుమారి జాతీయపతాకాన్ని ఆవిష్కరించి పతాకానికి వందనం చేశారు. డిప్యూటీ తహశీల్దార్ ఆర్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీఆర్వోలు, కార్యాలయ సిబ్బందికి మిఠాయిలు పంచారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో డి. శ్రీలలిత జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, కార్యాలయ ఏవో మంగతాయారులతో కలిసి గాంధీజీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈవోలు వైవీ.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, సర్వే డీటీ పవన్‌కుమార్, వీఆర్వోలు నూతలపాటి లోవరాజు, వెంకటేశ్వరి, కె.శ్రీను, పృథ్వీ, మామిడాల కామరాజు, వాసు, వెంకటలక్ష్మి, పాల్గొన్నారు. సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జాస్తిరామారావు జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. చైర్‌పర్సన్ జి.అరుణ, పాల్గొన్నారు. ప్రతిభా విద్యానికేతన్ విద్యార్థులు ర్యాలీ చేశారు. కరస్పాండెంట్ ఎస్వీవీజీ ప్రకాష్, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎస్.సుధా రాణి, టి.సునీత, పి.గౌరి, ఎం.సంతోషకుమారి పాల్గొన్నారు.

పెద్దాపురం: ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో జె.సీతారామారావు, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వజ్రపు జితేంద్ర, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో బత్తిన అశోక్‌కుమార్, సీఐ రవికుమార్, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జె.సురేంద్ర, నవోదయా విద్యాలయంలో ప్రిన్సిపాల్ కమలం, మహారాణీ కళాశాలలో ప్రిన్సిపాల్ వీరయ్య చౌదరి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ జాతీయ జండాను ఆవిష్కరించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గణతంత్ర చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో కళాశాల ఏవో కేఆర్ సందీప్, ఈవో జెన్నిబాబు, ఏసీవో పెదకాపు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు కోర్టు వద్ద జడ్జి కాటం భాను జెండా ఆవిష్కరణ చేయగా బార్ అధ్యక్షుడు పుల్లయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ గోపాలకృష్ణ పతాకావిష్కరణ చేశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు పతాకావిష్కరణ చేయగా ఎంపీపీ జీకే సుధాకర్, జడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంఈవో వి. రాజబాబు, ఏపీవో కుమారస్వామి, ఏపీఎం వెంకట్రావు, జేఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు. పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ ఎం. శేఖర్‌బాబు పతాకావిష్కరణ చేయగా ఎస్ఐ ఎం.పవన్‌కుమార్ విద్యార్థులకు స్వీట్లు పంచారు. ఏలేశ్వరం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఇన్‌చార్జి ఎంపీడీవో కె.సూర్యనారాయణ, ఎంఈవో కార్యాలయం వద్ద ఎంఈవో కె.అబ్బాయి పతాకావిష్కరణలు చేయగా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఎంపీటీసీలు వసల సూరిబాబు, కొప్పుల బాబ్జి పాల్గొన్నారు. ప్రత్తిపాడు మినర్వా కళాశాల వద్ద ఫౌండర్ డీవీఎస్ రాజు రమేష్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్‌బీ చౌదరి, ప్రిన్సిపాల్స్ హరిబాబు, మల్లికార్జున్, వైస్ ప్రిన్సిపాల్స్ జాతీయ పతాకానికి సెల్యూట్ చేశారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయం వద్ద కమిషనర్ సత్యనారాయణ, కౌన్సిలరు గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, ప్రజాప్రతినిధులు.. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వెంకటేశ్వరరావు.. పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ బాలాజీ, సొసైటీ కార్యాలయంలో సొసైటీ చైర్మన్ జ్యోతుల భీముడు, సీఈవో సూరిబాబు, మాధురి విద్యాలయలో విద్యాసంస్థల చైర్మన్ కడారి తమ్మయ్యనాయుడు జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.

గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు మండలపరిషత్ కార్యాలయ ఆవరణలోని జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ, జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు, ఎంపీడీవో డీ.శర్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మండల గ్రామాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు జాతీయ పతాకాలు ఎగురవేశారు.

తుని రూరల్: శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల్లో వేడుకలకు ముఖ్య అతిథిగా ఇన్‌కమ్‌ట్యాక్స్ ఆఫీసర్ కె.బాబురావు హాజరై ఎన్‌సీసీ విద్యార్థులతో గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకోవాలని ప్రయోజకులై దేశానికి మంచిపేరు తీసుకోవాలని ఆకాంక్షించారు. అన్నవరం వీర వెంకట సత్యనారాయణ దేవస్థానంలో ఆలయ అధికారులు వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఈవో కె.రామచంద్రమోహన్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. ఆలయ అధికారులు, పురోహితులు పాల్గొన్నారు. తేటగుంట టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య వేడుకలు నిర్వహించారు. జాతీయజెండాను ఆవిష్కరించి ప్రసంగించారు.

జగ్గంపేట: స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద జగ్గంపేట ఆర్యవైశ్యసేవా సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సంఘం జగ్గంపేట అధ్యక్షుడు కొత్త కొండబాబు ముఖ్య అతిథిగా హాజరై మహాత్మ గాంధీ, అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. పిల్లలకు చాక్లెట్స్, బిస్కెట్స్ పంపిణీ చేశారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీదేవి జెండా వందనం చేశారు. పంచాయతీ కార్యాలయంలో వేడుకల్లో బండారు రాజా,ఉపసర్పంచ్ గణేష్‌బాబు ఉన్నారు.

జగ్గంపేట రూరల్: ఇర్రిపాక గ్రామ వెలమదొర యూత్ ఆర్మీసేవా సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెలమదొర యూత్‌ఆర్మీ సేవా సంస్థ వ్యవస్థాపకరాలు సుర్ల మణిరత్న, కుంద్రపు లక్ష్మణరావు,గొర్ల చినబాబు,పైల వెంకట సూరి, వెలమ పెద్దలు పాల్గొన్నారు.

కిర్లంపూడి: కిర్లంపూడి ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, ఎంపీడీవో బడే రాజేశ్వరరావు.. జగపతినగరం పంచాయతీలో సర్పంచ్ శ్రీలతా రాంబాబు.. కిర్లంపూడి తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మాధవరావు, కిర్లంపూడి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐ ఉమామహేశ్వరరావు, భూపాలపట్నంలో సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు, శృంగరాయునిపాలెంలో పట్టు చంటిబాబు, ఎంపీటీసీ గరగ గోవిందు, ఉపసర్పంచ్ బొజ్జం శ్రీను, తామరాడ హైస్కూల్లో సర్పంచ్ తోట అయ్యన్న, గోనాడలో సర్పంచ్ అల్లు విజయ్‌కుమార్, రామచంద్రపురంలో తుమ్మలపల్లి రమేష్, కృష్ణవరంలో గొరకపూడి గోపీనాథ్, సోమవరంలో సూది శ్రీను, వేళంకలో సర్పంచ్ రాయుడు బాబురావు, జాతీయ జెండాలను ఆవిష్కరించి జెండా వందనం చేశారు.

గండేపల్లి: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకట్రామన్, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సత్యనారాయణ, పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐ ఎస్.రామకృష్ణ వేడుకలు నిర్వహించారు. సూరంపాలెం ఆదిత్య కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో, ప్రగతి కళాశాలలో చైర్మన్ పరుచూరి కృష్ణారావు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఎం.హరినాథ్‌బాబు, సతీష్‌కుమార్, కె.సత్యనారాయణ, ఆర్ఐ సురేష్, ఆదిరెడ్డి రమేష్, సంజయ్, కె.రవిశంకర్, పి.సతీష్‌కుమార్, ఎస్.కుమార్, ఎస్.సత్యనారాయణ ఉన్నారు.

కరప: కరప పీహెచ్‌సీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎస్సీ నాయకులు మారెళ్ల వెంకటరమణ, మండల పరిషత్, ఎంఈవో కార్యాలయాల్లో ఎంపీపీ, జడ్పీటీసీతో పాటు ఎంపీడీవో కొంకి అప్పారావు, ఎంఈవో-2 పత్తి సత్యనారాయణ, చింతా ఈశ్వరరావు, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు, పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ జి.ప్రసన్నకుమార్, కరప, వేళంగి పీహెచ్‌సీల వద్ద వైద్యాధికారులు శ్రీనివాసనాయక్, ఎంకే సౌజన్యలు జాతీయ జెండాలను ఎగురవేసి వందన సమర్పణ చేశారు. వైసీపీ మండలాధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు రొక్కాల గణిరాజు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జీవీ రమణకుమార్, ఆర్ఐ మాచరరావు ఉన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయంలో అధికారి పివెంకటనారాయణ, తహశీల్దార్ కార్యాలయంలో కేవీ.ప్రసాద్, పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ పి.స్వామినాయుడు, కొత్తపల్లి వీవీఎస్ విద్యాసంస్థల్లో కరస్పాండెంట్ అనిశెట్టి కృష్ణారెడ్డి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. భారీ జాతీయ జెండా ప్రదర్శన ఆకట్టుకుంది.

తాళ్లరేవు: తాళ్లరేవు తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఎస్.పోతురాజు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎమ్.అనుపమ, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ సరీష, అంబేడ్కర్ భవనం వద్ద ఎమ్‌డీయూడబ్ల్యుఏ అధ్యక్షుడు వెంటపల్లి చంద్రమౌళి జాతీయ పతాకాన్ని ఎగువేసి వందనం చేశారు.

రౌతులపూడి: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వేడుకలు జరిగాయి. డిప్యూటీ తహశీల్దార్ టీ.సత్యనారాయణ ఉత్తమసేవా పురస్కారం అందుకున్నారు.


పలువురికి ఉత్తమ సేవా పురస్కారాలు

కరప, జనవరి 26: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో పలువురు అధికారులు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. కరప ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణి, ఈవోపీఆర్డీ సలాది శ్రీనివాసరావు, రీసర్వే డీటీ కేఐ.సురేష్‌కుమార్, నడకుదురు వెల్‌నెస్ సెంటర్‌లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ కె.స్వాతిఅహల్య, నడకుదురు విలేజ్ సర్వేయర్ జె.హేమంత్‌కుమార్‌లకు ఉత్తమ సేవా పురష్కారాలు లభించాయి. కాకినాడ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్ నుంచి అవార్డులను స్వీకరించారు.

తాళ్లరేవు: తాళ్లరేవు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్య మిత్రగా పనిచేస్తున్న ఎమ్‌డి అబ్దుల్ ఖాజా మొహిద్దిన్ ఉత్తమసేవలకు కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు.

గండేపల్లి: తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఎం.రవికిరణ్‌ప్రశంసాపత్రం అందుకున్నారు.

ప్రత్తిపాడు: ఏలేశ్వరం ఎస్ఐ జి.సతీష్‌కుమార్, ప్రత్తిపాడు మండల వీఆర్వో చందక దుర్గాప్రసాద్ ఉత్తమ సేవా ప్రసంశాపత్రాలు కలెక్టర్ నుంచి అందుకున్నారు.


అవార్డు అందుకుంటున్న సామర్లకోట ఏవో

సామర్లకోట: సామర్లకోట మండల వ్యవసాయాధికారిణి యిమ్మిడిశెట్టి సత్యకు ఉత్తమ సేవలకు గాను జిల్లాస్థాయి ఉత్తమ గౌరవ పురస్కారం లభించింది.

సర్పవరంజంక్షన్: కాకినాడ రూరల్ ఎంపీడీవో కర్రె స్వప్న కలెక్టర్ నుంచి ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు.

తుని రూరల్: తుని పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కె.సూరిబాబుకు ఉత్తమ సేవా పురస్కారం వరించింది. కాకినాడలో ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ప్రసంశాపత్రం ఇచ్చారు.

కిర్లంపూడి: కిర్లంపూడి ఏఎస్ఐ రామకృష్ణ, కానిస్టేబుల్ శ్రీనివాసులకు ఎస్పీ ఉత్తమ సేవా అవార్డులు అందజేశారు.

'అత్యున్నత మౌలిక వసతి సదుపాయాల కల్పనకు చర్యలు'

జేఎన్టీయూకే, జనవరి 26: వర్సిటీలోని విద్యార్థులకు అత్యున్నత మౌలిక వసతి సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జేఎన్టీయూకే వీసీ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. ప్రాంగణంలోని బాలికల వసతిగృహాల సముదాయం వద్ద నిర్మించిన సెంట్రలైజ్డ్ మెస్‌బ్లాక్ (గౌతమిమెస్‌బ్లాక్)ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి యూసీఈకే ప్రిన్సిపాల్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా వీసీ మాట్లాడుతూ క్యాంపస్‌లో రూ.4.20కోట్లతో సెంట్రలైజ్డ్ మెస్‌బ్లాక్ నిర్మాణం చేపట్టి 600 నుంచి 800మంది వరకూ ఒకేసారి భోజనం చేసేందుకు అన్నిసదుపాయాలు కల్పించామన్నారు. సీఈ వి.శ్రీనివాసులు, డీఈఈ జి.మోహన్‌ప్రసాద్, ఏఈలు సన్నీ, ప్రదీప్, రెక్టార్ కేవీరమణ,రిజిస్ట్రార్ సుమలత ఉన్నారు.

కాంస్య విగ్రహాల ఆవిష్కరణ

వర్సిటీలోని ఐఎస్‌టీ వద్ద ఉమెన్ ఎంపవర్‌మెంట్, గ్రీవెన్సెస్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జ్యోతిరావుఫూలే, సావిత్రిబాయిఫూలే దంపతుల కాంస్య విగ్రహాలను శుక్రవారం ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు ఆవిష్కరించారు.

వైసీపీ పాలనలో అన్నివర్గాలకు అన్యాయం

» మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు » అమీనబాద్‌లో జయహో బీసీ సదస్సు


అమీనబాద్‌లో ప్రసంగిస్తున్న కొండబాబు

అమీనబాద్ (కొత్తపల్లి), జనవరి 26: వైసీపీ పాలనలో గడిచిన ఐదేళ్లుగా అన్నివర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ నేత, కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్‌వర్మ ఆధ్వర్యంలో శుక్రవారం అమీనబాద్‌లో నిర్వహించిన జయహో బీసీ సదస్సులో కొండబాబు ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. పేదలను ధనికులుగా మార్చిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీ కార్పొరేషన్లు ఏర్పాటుచేసి చైర్మన్లు, డైరెక్టర్లను నియమించి ఏ నిధులు లేకుండా సీఎం జగన్ పబ్బంగడుపుతున్నారని ఆరోపించారు. సైకో ముఖ్యమంత్రి వద్దకు వెళ్లాలంటే ప్రజాప్రతినిధులు హడలెత్తిపోతున్నారన్నారు. రాబోయే కాలంలో టీడీపీ,జనసేనల ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు కానుందని చెప్పారు. పిఠాపురం నియోజకవర్గంలో సుపరిచుతుడైన వర్మకు మరోకసారి అవకాశం కల్పించాలని కొండబాబు బీసీ సోదరులను కోరారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, మత్స్యకార నాయకులు సూరాడరాజు, నాగేశ్వరరావు, దావీదు, శికోటి నానాజీ, చోడిపల్లి ప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్‌చెర్మన్ పిల్లి చిన్నా, నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, రెడ్డం భాస్కరరావు, బర్ల అప్పారావు ఉన్నారు.

'టీడీపీ ప్రభుత్వం రావాల్సిందే'

రౌతులపూడి, జనవరి 26: బీసీలకు న్యాయం జరగాలంటే టీడీపీ ప్రభుత్వం రావాల్సిందేనని ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ, బీసీనేతలు అన్నారు. రౌతులపూడిలో కాకినాడ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు పైల సాంబశివరావు అధ్యక్షతన జయహో బీసీ సదస్సు నిర్వహించారు. టీడీపీ బీసీ మేనిఫెస్టో విడుదల చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్య భాస్కరరావు, పసగడుగుల రమణ, కిల్లాడ వరహాలు, గొల్లు పెద్దదివాణం, పి.సూరిబాబు, పల్లి కుమార్, లొండా దేవుళ్లు, బీసీ నేతలు ఉన్నారు.

సమన్వయంతో ముందుకు సాగాలి

ఎమ్మెల్యే చినరాజప్ప


సమావేశంలో మాట్లాడుతున్న చినరాజప్ప

పెద్దాపురం, జనవరి 26: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో విజయానికి కార్యకర్తలు, నేతలు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప టీడీపీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. స్థానిక దర్గా సెంటర్‌లో టీడీపీ నేత రాజాసూరిబాబురాజు స్వగృహంలో శుక్రవారం నిర్వహించిన సమన్వయ కమిటీ, శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికలకు కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలన్నారు. రాబోయేది టీడీపీ ప్రభుత్వమన్నారు. వైసీపీ వైఫల్యాలను ప్రజలకు మరింతగా వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటమి ఖాయమన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రి చేసేందుకు కార్యకర్తలంతా సమిష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజాసూరిబాబురాజు, కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి), నూనే రామారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

కరప, జనవరి 26: కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు శుక్రవారం యండమూరు, జి.బావారం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. వాటర్ ట్యాంక్‌లు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌ల కోసం ఏర్పాటుచేసిన పైపలైన్ సముదాయాలు, అంబేడ్కర్ విశ్రాంతి మందిరం, కమ్యూనిటీ హాళ్ళను ఎమ్మెల్యే కన్నబాబు ప్రారంభించారు. ఉప్పలంక, నడకుదురు, పెనుగుదురులో రూ.5.5 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, చైల్డ్‌రైట్స్ ప్రొటెక్షన్ కమీషన్ రాష్ట్ర సభ్యురాలు త్రిపర్ణ ఆదిలక్ష్మి, వైసీపీ మండలాధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, సర్పంచ్ బొమ్మిడి నయోమి సతీష్ పాల్గొన్నారు.


యండమూరులో వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

పేదలకు దుప్పట్ల పంపిణీ

కరప, జనవరి 26: కరపలో శుక్రవారం మాజీ ఎంపీటీసీ ఉడతా అచ్చియమ్మ 21వ వర్ధంతిని పురష్కరించుకుని వందలాది మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతికుమార్, మాజీ సర్పంచ్‌లు పోలిశెట్టి తాతీలు, పప్పు సావిత్రి దుప్పట్లు అందజేశారు. అచ్చియమ్మ వర్ధంతిని పురష్కరించుకుని ఏటా ఆమె కుమారుడు, రైల్వే సీఐ ఉడతా బంగార్రాజు, కుటుంబసభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు. వలసపాకల సర్పంచ్ వాసంశెట్టి రామారావు, రెడ్డి భద్రం, రెడ్డి రాముడు,భాస్కరరావు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

రౌతులపూడి, జనవరి 26: గిడజాంలో గంగాలమ్మతల్లి ఆలయాన్ని బీసీవై పార్టీ రాష్ట్ర సమన్వయ సారధి డాక్టర్ అనూషయాదవ్ పరిశీలించి రూ.పది వేలు విరాళంగా అందజేశారు. దేవర వెంకటరమణ, చీకాల దుర్గా మణికంఠ, గొర్ల వీరబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

గండేపల్లి, జనవరి 26: మల్లేపల్లికి చెందిన మోర్త చిన్న చనిపోవడంతో అతడి అమ్మమ్మ నూకాలమ్మకు తక్షణ సహాయంగా వైఎస్సార్ బీమా పథకం రూ.10 వేల చెక్కును ఉపసర్పంచ్ దొమ్మాశ్రీను అందించారు.

మాజీ సైనికులకు సన్మానం

గురజనాపల్లి (కరప), జనవరి 26: గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురజనాపల్లి హైస్కూల్‌లో శుక్రవారం హెచ్‌ఎం ఎ.సాయిమోహన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇండియన్ ఆర్మీలో సేవలందించిన గ్రామస్తులు పబ్బినీడి కనకరాజు (రాజేష్), చింతపల్లి అర్జునుడును సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన సైన్స్ ఫెయిర్ ప్రాజెక్టు గైడ్ టీచర్ వీవీ రమణమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగలింగేశ్వరరావులను కూడా సత్కరించారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్, 105 మినిట్స్, కెప్టెన్ మిల్లర్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్, కెప్టెన్ మిల్లర్

తిరుమల	:	సైంధవ్
లక్ష్మి	:	ఫైటర్
సీ అండ్‌సీ1	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	నా సామిరంగ
పద్మప్రియ	:	గుంటూరు కారం
సత్యగౌరి	:	నా సామిరంగ
సూర్య 1	:	గుంటూరు కారం
సూర్య 2	:	హనుమాన్